# బతుకు చదువు



- సర్వజిత్

**పు**చ్చపువ్వులా వెన్నెల కాస్తోంది.

వేసవికాలంలా బాగా ఉక్కగానూ వుంది.

గుడిసె ముందు వేప చెట్టు కింద నులకమంచం మీద పడుకుని ఆకాశం కేసి చూస్తున్నాడు గురువులు.

గుడిసె ముందు పంచలో కిరసనాయిలు దీపం పెట్టుకుని చదువుకుంటున్నాడు గురువులు కొడుకు వెంకన్న. వాడి అసలు పేరు వెంకటేశం. వెంకన్నగానే వాడు అందరికీ సుపరిచితుడు.

వెంకన్న ప్రక్కనే చాప మీద పడుకున్నది గురువులు భార్య నరసమ్మ. ఆమెకు మాగన్నుగా నిద్రపడుతోంది. మళ్లీ అంతలోనే నిద్ర పడుతోంది. ఆమె పక్కనే పదేళ్ళ కూతురు నిద్రపోతోంది.

అర్థం కాని కొడుకు చదువు వింటోంది నరసమ్మ.

చెట్టు కింద మంచం మీద పడుకున్న భర్తనీ, అతడిని కావలించుకుని పడుకున్న రెండో కూతురుని మధ్య మధ్యలో చూస్తోంది.

వెంకన్న తరువాత మరో ఆడపిల్ల పుట్టాక ఫ్యామిలీ ప్లానింగ్ వాళ్ళొస్తే ఆపరేషన్ చేయించుకుందా మనుకున్నాడు గురువులు. అయితే వాళ్ళూ, వీళ్ళూ ఏదో చెబితే వెనక్కి తగ్గాడు. ఇంతలో మూడోది పుట్టేసింది...

వెన్నలనీ, అందమైన వాతావరణాన్ని ఆస్వాదించే కళాత్మక హృదయం వాళ్ళల్లో లేకపోవచ్చు.

కానీ వాళ్లది నిరంతర జీవనపోరాటం.

ఈరోజు ఇలా ఉన్నాం గనుక రేపు కూడా ఇంత కడుపునిండా తిని, దర్జాగా ఉండాలన్న ఆరాటం వాళ్లకు లేకపోవచ్చు.

రోజూ రెక్కాడితేనే వాళ్ళ డొక్క నిండుతుంది. కానీ ఆశ పడటం మానవ సహజం. అలా పుట్టిన ఆశతోనే వెంకన్నని బడిలో

చేర్పించాడు గురువులు.

అయితే వెంకన్నని బడిలో చేర్పించాలని గురువులు అన్నప్పుడు నరసమ్మ అడ్డుపడింది. "సదువా...ఆడికా!?...యేం పెట్టి సదివిత్తావ్? సదువుకుంటే ఉజ్జోగాలొచ్చేత్తాయేటి?...ఎందుకూ పనికి రాకుండాపోతాడు...సదువూ వద్దు...గిదువూ వద్దు..." అనేసింది.

అరకొర చదువులు వెలగబెట్టి, ఉద్యోగాలు లేక సెంటర్లలో జులాయిగా తారట్లాడే కుర్రాళ్ళు ఒక్కసారిగా ఆమె మనసులో మెదిలారు. ఆమె చూసిన ఆ వాతావరణం ఆమె చేత అలా మాట్లాడించింది.

కానీ భార్య నరసమ్మ మాటలు వినలేదు గురువులు.

తన తండ్రి రిక్షా తొక్కాడు. కూలి పనులు చేశాడు. తనకేమిచ్చాడు. ఆ శ్రమనే వారసత్వంగా తను అందుకున్నాడు. అదే శ్రమ! అదే రిక్షా జీవితం!

ఈ బ్రతుకునే తన కొడుక్కి వారసత్వంగా ఇవ్వాలా తను? వాడిని ఇంతకన్నా కొంచెం మంచి బ్రతుకులో తను ఎందుకు చూడకూడదు?

ప్రతి తండ్రీ ఆలోచించినట్లే గురువులూ ఆలోచించాడు.

తన రిక్షా మీద కాన్వెంట్లకి వెళ్లే పిల్లల్ని చూస్తున్న కొద్దీ, వాళ్ళ మాటలు వింటున్న కొద్దీ కొడుకును చదివించాలన్న కోర్కె గురువులు మనసులో బలంగా నాటుకుపోయింది.

భార్య మాటలు కొట్టిపారేశాడు.

"ఏం ఆడు సదువుకుని ఏ సిన్న ఉజ్జోగమో సేయకూడదా? కలకటేరు కావాలని నేనంటున్నానేటి? ఈ రిచ్చా ఆడికి అప్పజెప్పను. ఆడిని సదివిద్దాం..."

భర్త మాటలు కటువుగా అనిపించలేదు నరసమ్మకి. అతడి గొంతులో ఉన్న బాధ కనిపించింది.

అంతకన్నా, వారసత్వపు లాగుడు జీవితానికి తనతో ముగింపు పలకాలన్న భర్త తపనని ఆమె అర్థం చేసుకోగలిగింది. కానీ...

ఇవన్నీ మనకి సాధ్యమేనా? లేనిపోని ఆశలకు పోయి అడుసులో కాలు వేసినట్లవుతుందా అన్నదే ఆమె దిగులు.


అయితే ఆ తరువాత వెంకన్న చదువు విషయంలో ఆమె అడ్డు చెప్పలేదు.

అడ్డు తగిలి తన కొడుకు మంచి భవిష్యత్తును తాను పాడు చేస్తున్నానా అని నరసమ్మ ఆలోచించింది.

వెంకన్న చదువు గురించి పట్టించుకున్న గురువులు ఇద్దరి కూతుళ్ళ చదువు గురించి పట్టించుకోలేదు. వాళ్లకి మంచి మొగుళ్లని తీసుకురావాలని మాత్రమే ఆలోచించుకున్నాడు.

## పాపం అభిషేక్

*ఈషాడియోల్ నటించిన చిత్రాలన్నీ వరుసగా ఫ్లాప్ అవడంతో సూపర్ ఫ్లాప్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకుంది. ప్రస్తుతం ఈ భామామణి అభిషేక్‌బచ్చన్‌తో కలిసి 'ఎల్‌ఓసి' అనే సినిమాలో నటిస్తోంది. నటన అంటే ఏమిటో బొత్తిగా తెలియని హేమామాలిని గారాలపట్టి ఈషాడియోల్ తుషార్‌కపూర్ కెరీర్‌ను ఎలాగూ ఫ్లాప్ బాటలో నడిపించి, అతనికి డిమాండ్ లేకుండా చేసింది. అభిషేక్, ఈషాలిద్దరూ ఫ్లాప్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రం హిట్ అవుతుందో లేదో వేచి చూడాల్సిందే!*



ఏమైతేనేం ఇప్పుడు వెంకన్న ఎనిమిదవ తరగతిలోకొచ్చాడు.

గురువులు రిక్షా కార్మికుడే అయినా ఇల్లు, వాకిలి, భార్య, పిల్లలు తప్ప వేరే ప్రపంచం ఎరుగనివాడు.

సారా కొట్టు, మట్కా జూదాలు వగైరా అలవాట్లు అతడికి లేవు. ఆ రోజు సంపాదించింది తెచ్చి భార్య చేతిలో పోస్తాడు.

ఆమె కూడా ఆ ఇంటా ఈ ఇంటా పని చేసి నాలుగు డబ్బులు సంపాదిస్తుంది. ఈ మధ్యనే పెద్ద కూతుర్ని కూడా రెండు మూడిళ్లలో పనికి పెట్టింది. నరసమ్మ గొప్పలకి పోయే మనిషి కాదు. భార్య, పిల్లల్ని రెండో ఆట సినిమాలకి, పండుగలు, పబ్బాలకి గుళ్ళు గోపురాలు తిప్పుతుంటాడు గురువులు.

రైల్వే ట్రాక్ పక్కన వద్దికగా కాపురం చేసుకునే గురువులు ఈ మధ్యనే బ్యాంకు వారి రుణంతో సొంతంగా రిక్షా కొనుక్కున్నాడు.

ఆ రిక్షా హ్యాండిల్‌కి అద్దం పెట్టించాడు. తమాషాగా కుచ్చులు వేలాడదీశాడు. చక్రాల కింద ఇరుసుకి ఐదు మువ్వలు కట్టాడు. రిక్షా నడుస్తుంటే ఆ మువ్వలు లయ బద్ధంగా చేసే ధ్వని అదో సరదాగా ఉంటుంది. ఆ మువ్వల చప్పుడు వినిపిస్తే చాలు గురువులు ఇంటికి వచ్చినట్లే.

ఓ రోజు...

రిక్షాకు ఉన్న అద్దంలో చూసుకుంటూ రిక్షాని అటూ ఇటూ కదిపి మువ్వలు శబ్దం చేస్తూ, కుచ్చులతో ఆడుకుంటున్న వెంకన్న రిక్షా ఎక్కి, "ఆ ఎక్కండి బాబూ...సెంటర్‌కి మూడ్రూపాయలే...రైల్వే స్టేషన్‌కి ఐదు రూపాయలే...ఎక్కండి..." అంటూ రిక్షా గంట కొడుతుంటే...

అప్పుడే అన్నం తిని చెయ్యి కడుక్కున్న గురువులు కొడుకు వెంకన్న కేరింతలు విన్నాడు.

ఒక్కసారిగా అతనికి కోపం వచ్చేసింది. విసురుగా బయటికి వచ్చి రిక్షా సీటు మీద కూర్చున్న వెంకన్న రెక్క పుచ్చుకుని కిందకు లాగాడు. దబదబా నాలుగు బాదేశాడు.

"ఎదవా...ఈ రిచ్చా బతుకు నీకొద్దురా, సదువుకోరా అంటే రిచ్చా బండాట ఆడుకుంటున్నావా?" అంటూ తిట్టి పోశాడు.

ఇంతలో నరసమ్మ వచ్చి భర్త చేతిలోంచి వెంకన్నని విడిపించి దగ్గరకు తీసుకుంది.

"రిచ్చా ఎక్కితే ఏటవుద్దీ? నీది మరీ చోద్యం! ఆడు సరదాగా ఆడుకుంటుంటే కూడా తప్పా?" అంటూ భర్తని గదిమింది.

"ఇపుడు సరదాగా ఎక్కుతాడు. రేపు సదువుకి ఎగనామం పెట్టి నిజంగానే రిచ్చా తొక్కుతానంటాడు. ఈ సారి రిచ్చా ఎక్కి తొక్కితే సంపేత్తా ఎదవా" అనేసి రిక్షా తీసుకుని వెళ్ళిపోయాడు గురువులు.

నరసమ్మ వడిలో బిక్కుబిక్కు మంటూ ఏడుస్తూ కూర్చున్నాడు వెంకన్న.

"తను అంత తప్పు ఏం చేశాడని? నాన్న అంతగా కొట్టవలసిన అవసరం ఏం వచ్చిందని?" ఈ ప్రశ్నలకి వాడికి జవాబు దొరకలేదు.

కొడుకుని తిట్టి, కోపంగా వచ్చేసిన గురువులు సెంటర్లో రిక్షా పెట్టుకుని కూర్చున్నాడన్న మాటేగాని మనస్సంతా దిగులుగా వుంది.

కుర్రాడిని అనవసరంగా కొట్టానే అని మదనపడసాగాడు. సరదాగా రిచ్చా ఎక్కి తొక్కినంత మాత్రాన రిక్షా కార్మికుడైపోతాడా తన పిచ్చిగాని అని తనకి తాను తిట్టుకున్నాడు.

తన కొడుక్కి ఈ బతుకు రాకూడదు అదే గురువులు మనసులో బలంగా నాటుకుపోయిన ఆకాంక్ష. దాని ఫలితంగానే వెంకన్న సరదాగా కూడా రిక్షా తొక్కడం తను చూడలేదు.

ఆ రాత్రి ఇక బేరాలు చాలించి ఇంటికి వెళుతూ పిల్లల కోసం, ముఖ్యంగా వెంకన్న కోసం



## హిందీ తెరపై ప్రియా గిల్

'సిర్‌ఫ్ తుమ్', 'జోష్' చిత్రాల్లో హీరోయిన్‌గా నటించి అవి హిట్ అయి కూడా సరైన నిర్ణయాలు తీసుకోలేక చేతిలో ఉన్న ఐదు సినిమాలను పోగొట్టుకుంది. దీనితో ఆమె హిందీ చిత్రాలపై ఆశ వదులుకోవాల్సింది. దక్షిణాది భాషల్లో నటించినా ఆశించినంత పేరు రాక మాతృభాష పంజాబీలో నటించింది. ఆ చిత్రం సూపర్ హిట్ అవడంతో, హిందీ నిర్మాతలు ప్రియా గిల్‌పై ఆసక్తి చూపిస్తున్నారు. బాలీవుడ్ ప్రియా గిల్‌కు స్వాగతం షలుకుతోంది. త్వరలో హిందీ తెరపై ప్రేక్షకులు ప్రియా గిల్‌ను చూస్తారు.

స్వీటు కొని మరీ తీసుకెళ్ళాడు. వాడికిష్టమైన మైసూర్ పాక్ తీసుకువెళ్ళాడు. నిద్రపోతున్న పిల్లలు ముగ్గురినీ లేపి మరీ తినిపించాడు.

తెల్లవారింది.

యథావిధిగా గురువులు రిక్షా తీసుకుని వెళ్ళిపోయాడు. నరసమ్మ మామూలుగా పనులు చేసుకుని వచ్చి కొడుకు వెంకన్నని స్కూలుకు పంపింది.

ప్రొద్దుటి నుంచీ ఎండ లేదు. ఆకాశం నిండా మబ్బులు కమ్ముకున్నాయి. వాతావరణం చల్లగా వుంది.

మధ్యాహ్నం కావస్తోంది.

అన్నం తినడానికి గురువులు ఇంకా ఇంటికి రాలేదు. నరసమ్మ ఎదురు చూస్తోంది. అతడు మామూలుగా వచ్చే సమయం దాటిపోయి చాలాసేపయ్యింది.

సాయంత్రం నాలుగు గంటలవుతోంది. అప్పటికీ గురువులు రాలేదు.

ఎవరో గుడిసె ముందు పిలుస్తుంటే బయటకొచ్చింది నరసమ్మ.

"గురువులికి యాక్సిడెంటయ్యింది". అన్నాడా వచ్చిన వ్యక్తి.

"యాక్సిడెంటా?"

"మద్దేన్నం రెండింటికంట. లారీ గుద్దేసింది. అక్కడికక్కడే సచ్చిపోయాడు."

కుప్పకూలిపోయింది నరసమ్మ.

ఏడుపులు, పెడబొబ్బలు...ఆ తరువాత జరగవలసిన తంతులన్నీ జరిగిపోయాయి.

నరసమ్మకి తోడుగా ఆమె తల్లి వుంది. జరగరాని ఘోరం జరిగిపోయింది. నరసమ్మ జీవితం ఇప్పుడు వీధిన పడింది.

వెంకన్న ఇరవై రోజులయ్యింది బడి మానేసి. వాడిని బడికి వెళ్లమని ఎవరూ అనడం లేదు.

ఫలానా అని చెప్పలేడు గానీ వాడికీ బడికి వెళ్ళాలనిపించడం లేదు.

ఆ రోజు చెట్టు క్రింద వున్న రిక్షాని బయటికి లాగాడు. ముందు చక్రం తుక్కు తుక్కయి పోయింది. మిగిలిన రిక్షా అంతా బాగానే వుంది.

లారీ యజమాని పలుకుబడి వున్నవాడు. చప్పున రంగంలోకి దిగి కేసూ గట్రా లేకుండా చేసుకోగలిగాడు. నరసమ్మ అన్నకీ, తల్లికీ ముట్టుజెప్పాడు. నరసమ్మకీ ముట్టచెప్పాడు. నోరు విప్పినా ఎదుర్కొనే శక్తి లేని దాన్నని ఊరుకుండిపోయింది.

లారీ డ్రైవర్‌దే తప్పయినా రికార్డుల్లో గురువులదే తప్పుగా నమోదయింది...

రిక్షాని అటూ ఇటూ కదల్చడానికి ప్రయత్నిస్తున్న వెంకన్న దగ్గరికి ఓబులయ్యా వచ్చాడు. గురువులు ప్రక్క గుడిసెలోనే ఉంటూ, గురువులుతో బాటే ఓబులయ్యా రిక్షా తొక్కుతుంటాడు.

వెంకన్న అవస్థ చూశాడు ఓబులయ్య. తన రిక్షా తీసుకొచ్చాడు. పాడైన గురువులు రిక్షాని, తన రిక్షా వెనుక కట్టి "రారా ఎంకన్నా! దీన్ని బాగు చేయిద్దాం" అన్నాడు ఓబులయ్య.

కొడుకు అలా వెళుతుంటే నరసమ్మ చూసింది. ఏమీ అనలేదు. అమ్మమ్మా చూసింది. ఆమె కూడా ఏమీ అనలేదు.

"ఇంకేం సదువుతాడు?...సంపాదించే వాడు ఎల్లిపోయాడు..."తనలో తాను అనుకుంటున్నట్లు అన్నది నరసమ్మ తల్లి.

ఆ మాటకి నరసమ్మ గుడ్ల నీరు కుక్కుకున్నది.

అమ్మమ్మ మాటలు విన్నాడు వెంకన్న. తల్లి దుఃఖించడమూ చూశాడు.

"బడి సదువు సాల్లే! పదరా బతుకు సదువు నేర్చుకుందువుగాని..." నవ్వుతూ అన్నా ఓబులయ్య కంఠంలో జీర ధ్వనించింది.

తన రిక్షా వెనుక గురువులు రిక్షా కట్టి ఓబులయ్య రిక్షా తొక్కుకుని వెళుతుంటే ఆ వెనుకనే వెంకన్న ఆ రిక్షాని తోస్తూ నడుస్తున్నాడు.

గురువులు రిక్షాకి కట్టిన మువ్వలు మ్రోగుతున్నాయి.

కానీ లయలో ఏదో తేడా వినిపిస్తుంది.

'బాల కార్మిక వ్యవస్థ నిరోదిద్దాం...' అని ఇంకా ఏదో రాసి వున్న గోడ మీద నిక్కరు పైకెత్తి పాసు పోస్తున్నాడు ఓ ఐదేళ్ల కుర్ర వెధవ!! ❃

## మాధురీ కాదు ఐశ్వర్య

సంజయ్‌లీలా భన్సాలీ ఇప్పటి వరకూ నిర్మించిన రెండు చిత్రాలు 'హమ్ దిల్ దే చుకే సనమ్', 'దేవదాస్' చిత్రాలు సూపర్ హిట్ అయి నిర్మాతగా మంచి పాపులారిటీని సంపాదించిన సంజయ్‌లీనా భన్సాలీ 'దేవదాస్' చిత్రాన్ని అస్కార్ అవార్డు పరిశీలనకు పంపడంతో గాల్లో తేలిపోతున్నాడు. ఈ సందర్భంగా అతను మరో చిత్రాన్ని నిర్మించాలనే ప్లాన్‌లో ఉన్నాడు. ఇందులో కూడా ఐశ్వర్యను హీరోయిన్‌గా పెట్టుకున్నాడు. మరో విషయం ఏమిటంటే ఈ చిత్రంలో మాధురీ దీక్షిత్ నటించడం లేదట. దీనితో ఐస్ మీద సంజయ్ దిల్ పారేసుకున్నాడనే పుకార్లు బాలీవుడ్‌లో జోరుగా వినిపిస్తున్నాయి.

